నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ వద్ద 44వ జాతీయ రహదారి పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కెవి సాయిగీతా ఆశ్రమం పరిధిలోని ప్రెస్టేజ్ పార్క్, కార్తీక్‌రెడ్డి గోదాం, అంథమ్ విల్లాస్, సోమినయ్ స్టీల్, మైపీ విల్లాస్, కేవి రెడ్డి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

మాధురీలతకు డాక్టరేట్



పోచారం: చౌదరిగూడలోని నల్లనర్సింహారెడ్డి విద్యా సంస్థల్లో ఫార్మసీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న తాడంకి మాధురీ లతకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. ఫార్మసీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ మద్ది రామయ్య పర్యవేక్షణలో 'డిజైన్ డెవలప్‌మెంట్ క్యారక్టరైజేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ సాలిడ్ డిస్పర్షన్స్ ఆఫ్ యాంటి హైపర్‌టెన్సివ్ డ్రగ్స్ బై అప్లయింగ్ క్వాలిటీ బై డిజైన్' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా మాధురిని ఎస్ఎన్ఆర్‌జీ డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి, ఫార్మసీ విభాగాధిపతి ప్రొఫెసర్ కృష్ణ మోహన్ చిన్నాల, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట్: సీఎంఆర్‌ఎఫ్ పథకం ఆపదలో ఉన్న పేదలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన నివాసంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌కు చెందిన ఎక్కలుదేవి ముత్యాలు కు రూ. 30,000, కొల్తూర్ గ్రామానికి చెందిన రమేష్ కు రూ. 47,000, శామీర్‌పేట గ్రామానికి చెందిన పద్మకు రూ 60,000, మురళికి రూ. 60,000 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్సింహులు యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి , గడ్డం రమేష్, శశిధర్ రెడ్డి, నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించగా సకాలంలో స్పందించిన తోటి విద్యార్థులు ఆమెను కాపాడారు. వివరాల్లోకి వెళితే కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కీర్తి పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో బుధవారం మధ్యాహ్నం కళాశాల భవనం 4వ అంతస్తు కిటికీ లోనుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. దీనిని గుర్తించిన ఆమె స్నేహితులు వెంటనే ఆమెను పట్టుకుని కాపాడారు. కళాశాల సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఆమెను సురక్షితంగా కిందకు దించారు. ఆమెకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కాగా విద్యార్థిని కిటికీ వద్ద ఉన్న సమయంలో ఫిట్స్ రావడంతో కిటికి లోనుంచి పడిందని, ఆత్మహత్యకు పాల్పడలేదని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

చెరువులో పడి వ్యక్తి మృతి



కిరణ్ మృతదేహం

మేడ్చల్‌రూరల్: చెరువులో స్నానం చేస్తుండగా ఫిట్స్ రావడంతో ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబిల్‌పూర్‌లో బహోటు చేసుకుంది. ఎస్ఐ అనిత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా, మద్నూర్‌కు చెందిన కిరణ్(35) మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం కామారెడ్డికి చెందిన స్నేహితుడు ఇంటికి వెళ్తుండగా అతనితో పాటు కిరణ్ రైలులో బయలుదేరారు. మార్గమధ్యలోని డబిల్‌పూర్ రైల్వే స్టేషన్‌లో దిగిన వారు గ్రామంలోని పెద్ద చెరువు వద్దకు స్నానం చేసేందుకు వెళ్లారు. నీటిలోకి దిగిన కిరణ్ స్నానం చేస్తుండగా ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో నీటిలో పడిపోయాడు. దీనిని గుర్తించిన అతడి స్నేహితుడు స్థానికుల సహాయంతో బయటికి తీయగా అప్పటికే కిరణ్ మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టి కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ

ప్రయాణంలో ప్రియమైన వారిని గుర్తుంచుకోవాలి

- విద్యార్థులు ట్రాఫిక్ యోధులుగా మారాలి
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



డ్రైవర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ

ఘట్‌కేసర్: సమష్టి కృషి తోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు.బుధవారం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ (ఆర్‌కేఎస్‌సీ) సహకారంతో 'రోడ్ సేఫ్టీ మాసం -2025''ను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా, అంకుషాపూర్ ఏసీఈ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాచకొండ సీపీ మాట్లాడుతూ డ్రైవర్లు, విద్యార్థులు రోడ్డు భద్రతలో కీలక పాత్ర పోషించాలన్నారు. పోలీసులకు సహకరిస్తూ ''ట్రాఫిక్ యోధులు''గా మారాలని విద్యార్థులకు సూచించారు. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. లారీలు, ఆటోల కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆయా ఘటనల్లో కుటుంబ పెద్దలు, యువకులే మృత్యువాత పడుతున్నారన్నారు. డ్రైవర్ల సహకారం లేనిదే ప్రమాదాలు నివారించలేమన్నారు. డ్రగ్స్, మద్యం మత్తు, సీటు బెల్ట్ పెట్టుకోకుండా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని, ఇతరుల ప్రాణాలు హరించొద్దన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనం నడపాలని, ఆ సమయంలో కుటుంబ సభ్యులు, ప్రియమైన వారిని గుర్తుంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లిన వారికి, సమాచారం ఇచ్చిన వారికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పోస్టర్‌ను ఆవిష్కరించి డ్రైవర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబ సభ్యులతో వేదికపై మాట్లాడించారు. కార్యక్రమంలో డీసీపీలు మనోహర్, మల్లారెడ్డి, శ్రీనివాసులు, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి ముత్యాలు, కోఆర్డినేటర్లు రాజేశ్ జగన్‌యాదవ్, సూర్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు జోసఫ్, ప్రదీప్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ పరుశురాం, అర్చన, కళాశాల ప్రిన్సిపల్ బీఎల్ రాజు, కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, ఏసీఈ, విజ్ఞన్ ఉమ్మెన్స్ ఇంజినీరింగ్, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, బస్, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దు



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పట్టణ పరిధిలో రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారులు ఇతరులకు ఇబ్బందులు లేకుండా తమ వ్యాపారాలను చేసుకోవాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మార్కెట్‌లో ఆయన వీధి వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాపారులు ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకోవాలని, రద్దీ ఉండే రోడ్లపై వ్యాపారాలు చేయవద్దని సూచించారు.ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తూ రోడ్లపై వ్యాపారాలు చేస్తే ట్రాఫిక్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు మున్సిపల్ అధికారులు తమకు కేటాయించిన స్థలాల్లోనే స్టాల్స్ ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకోవాలన్నారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్, ఎస్ఐ పరుశరాం సిబ్బంది,మాజీ కౌన్సిలర్ నర్సింహాస్వామి యాదవ్ వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యకు విలువలు జోడించాలి

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

పోచారం: అర్హులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన కొనసాగుతుందని, విద్యకు ప్రమాణాలతో పాటు విలువలను జోడించాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులందరూ ప్రతిభావంతులుగా ఎదగాలని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఘనంగా వార్షికోత్సవాన్ని నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనీయులన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు అలరించారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని, రామగుండం ఎమ్మెల్యే మఖన్‌సింగ్ ఠాకూర్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోటకూర వజ్రేష్ యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాష్ట్ర క్రీడా పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు



భోజనశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట్: క్రీడలతో పాటు విద్యాబోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని మేడ్చల్ జిల్లా జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం ఆయన హకీంపేట్‌లోని తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... స్పోర్ట్స్ స్కూల్‌లో టెన్నిస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ తదితర రాకెట్ క్రీడలను ప్రవేశపెట్టి, ఆ దిశగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. స్కూల్‌లోని విద్యార్థుల సంఖ్య, మెనూపై కలెక్టర్ ఆరా తీశారు. తరగతి గదులు, గేమ్స్ ప్రాక్టీస్ హాల్, గ్రౌండ్స్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం ఓపెన్ గ్రౌండ్స్‌లలో వీక్షకులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా యువజన క్రీడల అధికారి గోపాల్ రావు, స్కూల్ ప్రిన్సిపల్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణ మాఫీ చేయాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సహకార సంఘాల నాయకులు

మేడ్చల్: మండలంలోని రైతు సేవా సహకార సంఘాల పరిధిలో అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలని రైతు ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు బుధవారం సంఘం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, మేడ్చల్ సొసైటీ అధ్యక్షుడు రణదీప్‌రెడ్డి, పూడూర్ సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తదితరులు జిల్లా అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. డబీల్‌పూర్ సంఘం పరిధిలో స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ద్వారా 254మంది రుణాలు తీసుకోగా కేవలం 150మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని, మేడ్చల్ పరిధిలో 524మందికి గాను 398 మంది రైతులకు, పూడూర్ పరిధిలో 1400మంది రైతులకు గాను 254మందికి, డబీల్‌పూర్ సొసైటీ పరిధిలో 661మంది రైతులకు గాను 340మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, డైరక్టర్లు మధుసూదన్‌రెడ్డి, మధు, దేవేందర్‌రెడ్డి, భూపాల్ ,బ్రహ్మానందరెడ్డి, సంజీవ, సత్తయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ది క్రిక్ స్కూల్‌పై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మేడ్చల్: ఫీజులు కట్టలేదని విద్యార్థిని ఇబ్బందులకు గురి చేసిన ది క్రిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ క్రిక్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు సూర్యన్స్‌సింగ్ అనే విద్యార్థిని ఫీజు కట్టలేదని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో నిలబెట్టి శిక్షించారన్నారు. ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న క్రిక్ స్కూల్ గుర్తింపు రద్దు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సంతోష్,నాయకులు శ్యాంరావు, మనీష్, శివ,ప్రశాంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని బస్తీల్లో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు బుధవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రతి జయంతి, వర్ధంతి కార్యక్రమానికి పూలమాలలతో అలంకరించి కార్యక్రమాన్ని చేపట్టాలని ఆమె వినతిపత్రంలో కోరారు.

విద్యుత్ లైన్‌మెన్‌పై దాడి

మల్కాజిగిరి: విద్యుత్ బకాయిలు చెల్లించాలని అడిగిన జూనియర్ లైన్‌మెన్‌పై దాడిచేసిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గణేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న కురం సురేష్ ఈనెల 27న క్రిష్ణనగర్ ఆర్టీసీ కాలనీలో ఇర్ఫాన్ అనే వ్యక్తి బిల్లు చెల్లించకపోవడంతో ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన ఇర్ఫాన్ సురేష్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తూ.. అతడిపై దాడిచేసి ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఏఏఈ నర్సిరెడ్డి ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాంబు బెదిరింపులపై విచారణ చేపట్టాలి

మల్లాపూర్: నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బాంబు బెదిరింపులపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ బుధవారం నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్‌కు ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఈ మెయిల్ కాల్స్ ద్వారా బాంబు ఉన్నట్లు సమాచారం వస్తుందని, ఆ సమయంలో చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. దీనిపై విచారణ చేపట్టి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, స్వప్న, ప్రీతం, అంజి, సంజుయాదవ్, మహేంద్ర తదితరులున్నారు.

నాయకులు నిత్యం ప్రజా సేవలో ఉండాలి



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

మేడ్చల్‌రూరల్: రాజకీయ నాయకులకు పదవులకు మాత్రమే పదవీకాలం, విరమణ ఉంటాయే కాని ప్రజా సేవకు కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో బుధవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వజ్రేశ్‌యాదవ్ తదితరులు పదవీ కాలం పూర్తి చేసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్న వారు పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజాసేవలో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అప్పుడే మంచి నాయకుడిగా గుర్తింపు పొందుతారని ,ప్రజలు సందర్భం వచ్చినప్పుడు పట్టం కడతారన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రంరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళల భద్రత.. షీ టీం బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శామీర్‌పేట్: మహిళలకు పూర్తి భద్రత కల్పించడమే షీ టీం బాధ్యతని షీ టీం ఇన్‌చార్జ్ ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీం టీం ఎలా పనిచేస్తుంది, మహిళలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే అంశాలపై విద్యార్థినులకు వివరించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ద్వారా వేధింపులకు గురి చేస్తే 100 కి కాల్ చేసి సమాచారం అందించాలని, బాల కార్మికుల వేధింపులు, బాల్య వివాహాలపై స్పెషల్ టీం పనితీరుపై అవగాహన కల్పించారు. ఫిర్యాదిదారుల వివరాలు రహస్యంగా ఉంచుతామని, మహిళల రక్షణకు ఎల్లవేళలా షీ టీం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీం ఇన్‌చార్జ్ తుల్జారాం, కానిస్టేబుళ్లు వెంకటేష్, రాజేష్, అనూష, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు, బాలురు, మహిళలు పాల్గొన్నారు.

ఉప్పల్ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయింపు



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కళాశాల సిబ్బంది

ఉప్పల్: ఉప్పల్ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయకుమార్, ఉపాధ్యాయులు తిరుపతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరామని, సానుకూలంగా స్పందించిన మంత్రి రామంతాపూర్ రోడ్డు డీఎస్ఎల్‌మాల్ పక్కన ఉన్న రెండెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా

కీసర: కీసర ఓఆర్ఆర్ జంక్షన్ సమీపంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల(బాలనగర్, సనత్‌నగర్,) పాఠశాలను మంగళవారం రాత్రి తెలంగాణ రాష్ట్ర వైద్య , ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, వసతులు ఎలా ఉన్నాయి, బోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్‌లో వంటగది , భోజనశాల, ఇతర వసతులను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రుచిగా, శుభ్రతతో కూడిన ఆహారం అందించాలని, నిర్వహకులకు సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారు చదువుల్లో రాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట మేడ్చల్ - మల్కాజ్‌గిరి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికగుప్తా, జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి తదితరులు ఉన్నారు.

అలరించిన నవరిత్ 2కె25



కీసర: గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరిత్ - 2కె25 అలరించింది. మాతృశ్రీ ఈ అండ్ ఎల్ స్కూల్, సెంట్ ఎండర్యూస్ స్కూల్, చీర్యాలలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 430 మంది విద్యార్థులు ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ప్రాజెక్టుల పనితీరును ఇంజనీరింగ్ విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, డైరెక్టర్ ఉదయ్‌కుమార్, ప్రిన్సిపల్ సాగర్, డీన్ బి. హరికుమార్, హెచ్ఓడి శ్రీ లక్ష్మి, నిర్వహకురాలు శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సబితా ఆంజనేయులుగౌడ్‌ను సత్కరిస్తున్న నేతలు

కీసర: పదవిలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాగారం మున్సిపల్ 7వ వార్డు తాజా మాజీ వార్డు కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు బీఆర్ఎస్ ప్రెసిడెంట్ జి.మధుగౌడ్, ఉద్దెమర్రి మాజీ ఉపసర్పంచ్ నల్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సత్కార సభలో ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మున్సిపల్ పరిధిలోని 7 వ వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కాలనీలో రోడ్లు, మంచినీటి సరఫరా, వీధిదీపాల ఏర్పాట్లు, లో ఓల్టేజీ నివారణకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, అంజలి సురేందర్‌రెడ్డి, పావని జైపాల్‌రెడ్డి, అరుణ యాదగిరి, శ్వేతా శ్రీశైలం, జ్యోతి తిరుపతి, పావని, సుజాత ఆనందరాజు, బాలరాజు, నాగమణి, కవితనవీన్, మాధవీ కృష్ణ, సంధ్య భిక్షపతి, వెంకన్న నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూజన్ - 2025 పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి

కీసర: గీతాంజలి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ (జీసీఈటీ) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఫ్యూజన్ 2025ను ఫ్రిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం కళాశాల ఆవరణలో ఫ్యూజన్ పోస్టర్‌ను కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యూజన్ 2025 రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. బీటెక్, ఎం.టెక్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, డైరెక్టర్ ఉదయకుమార్, ప్రిన్సిపాల్ సాగర్, డీన్ హరికుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్టూడెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.